# గబ్బు డబ్బు

ఫేకల్టీ రూమ్‌లో కూర్చొని పేపరు తిరగేస్తున్నాను. సెల్ మోగింది. బ్యాగ్‌లోంచి తీశాను ఆశ్చర్యం! డాక్టర్ రంగనాథం నుంచి ఫోన్. నా భర్త నుంచి ఫోన్! సమయం ఉదయం పదిన్నర అవుతోంది. ఈ సమయంలో తనెప్పుడూ ఫోన్ చేయరే. సెల్ ఆన్‌చేసి 'చెప్పండి' అన్నాను.

"సంధ్యా. తక్షణం నీవు లక్ష రూపాయలతో మన లాయర్ చలపతిరావుని కలు. క్విక్"

ఉద్విగ్నతకు గురై ఊపిరితీయడం మరిచేను.

"ఎందుకు? మీ గొంతు ఏమిటీ అలా వుంది. ఏమైంది? ఆర్ యు ఒకే?"

నా కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. చేతిలో సెల్ వణుకుతోంది.

"చలపతిరావు నీకంతా చెబుతారు సంధ్యా. బీ కూల్. వెంటనే బయల్దేరు. ఆయన నీ కోసం ఎదురు చూస్తున్నారు."

మరో లెక్చరర్‌ని నా క్లాసు తీసుకోమని చెప్పి, కాలేజీకి సెలవు పెట్టేసి కారులో బయల్దేరాను.

బ్యాంక్‌లో డబ్బు డ్రా చేసి చలపతిరావు ఇంటికి వెళ్ళేను. ఎలా వెళ్ళానో తెలీదు. ఒత్తిడిలో, గాభరాలో, స్పీడులో ఎదురుగా వస్తున్న కారుని గుద్దేయబోయేను. అదృష్టం. వెంట్రుకవాసిలో ఏక్సిడెంట్ తప్పించుకున్నాను.

నిజమే. చలపతిరావు నాకోసం ఎదురు చూస్తున్నారు.

వెళ్ళిన వెంటనే డబ్బు వారిచేతిలో పెట్టేను. పెడుతూ, 'మా వారికి ఏమైంది అన్నయ్యగారూ' అని అడిగేను ఆందోళనతో.

"డాక్టర్ నీకేమీ చెప్పలేదా?"

"లేదన్నయ్యా. మీ ద్వారా తెల్సుకోమన్నారు"

"డాక్టర్ పెద్ద స్టుపిడ్ పని చేశాడమ్మా. ఉదయం హాస్పటల్‌లో పబ్లిగ్గా పేషెంట్ నుంచి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ వారికి దొరికిపోయాడు. అదీ సంగతి. ఈరోజు బెయిల్‌పై డాక్టర్‌ని తీసుకురావాలి. ఈరోజు దాటిపోతే కోర్టుకి రెండు రోజులు సెలవు. కోర్టు తెరిచేవరకూ డాక్టర్‌ని బొక్కలో పడేస్తారు".

నా శరీరంలో వేడి రక్తం శుష్కించి ఒక్కసారిగా శీతలం కమ్మినట్లయింది. నిస్సత్తువ నిలువునా ఆవహించి, కళ్ళు బైర్లు కమ్మి కుర్చీలో కూలబడిపోయేను.

చలపతిరావు కేకవేసి లలితను పిలిచేడు. ఆమె లాయర్ భార్య. ఆమె కూడా లాయరే.

నా ముఖంపై నీళ్ళు జల్లి వేడివేడి టీ ఇచ్చి, నా పక్కనే కూర్చొని ధైర్యవచనాలు పలికింది.

భార్యాభర్తలిద్దరూ మాకు మంచి మిత్రులు. రెండేళ్ళక్రితం చలపతిరావు మోటార్‌బైక్ ఏక్సిడెంట్‌లో కుడికాలు, ఎడమచేయి విరగ్గొట్టుకొని, మా శ్రీవారు చెప్పిన ప్రయివేట్ ఆసుపత్రిలో జాయినై మావారి ఆపరేషన్‌తో, ట్రీట్‌మెంట్‌తో బయటపడ్డాడు. లాయర్ నుంచి డాక్టర్ ఫీజు ఒక్కరూపాయి కూడా తీసుకోలేదు. ఇస్తే తీసుకునేవారో లేదో తెలియదు. లాయర్ ఇవ్వలేదు. డాక్టర్ అడగలేదు.

డాక్టరూ, లాయరూ రోజూ తెలతెలవారగనే ఠంచనుగా కలుస్తారు. వాకింగ్ ఫ్రెండ్స్. వీళ్ళిద్దరేకాదు. మొత్తం అరడజనుమంది. అంతా ఉన్నతహోదాలో, మంచి పొజిషన్‌లో వున్నవాళ్ళే. అందరూ అయిదుపదుల వయసు దాటినవాళ్ళే.

వాళ్ళతోబాటు ఆడవాళ్ళం మేము కూడా వాకింగ్ చేస్తాం. లాయర్ లలిత కూడా వస్తుంది. మాది వేరే బేచ్. వాళ్ళలా మేం బ్రిస్క్ వాకింగ్ చేయలేం కదా. మాది పెళ్ళినడక.

ఏసీబీ డియస్పీ సోమలింగంగారు కూడా వీళ్ళకి వాకింగ్ ఫ్రెండే. ఆయన ఉదయం వాకింగ్‌లో డాక్టర్ని హెచ్చరించారట. "రంగనాథం గారూ మీపై తరచు కంప్లయింట్స్ వస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఏసీబీ దాడి మీపై జరగొచ్చు. జాగ్రత్తగా వుండండి" అన్నారట.

"ఒక ఏసీబీ పెద్దాయన ప్రత్యేకంగా హెచ్చరించినపుడు ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలి కదా. స్వయంకృతం. చేతులారా జైలుశిక్షను కొనితెచ్చుకోవడం అంటే ఇదే" అన్నాడు చలపతిరావు కటువుగా.

డాక్టర్ బెయిల్‌మీద వచ్చిన తర్వాత ఆ విషయం అడిగేను.

అవును నిజమేనని ఒప్పుకున్నాడు.

"సంధ్యా. మేము వాకింగ్‌లో ఎన్నో విషయాలు సరదాగా మాటాడుకుంటాం. జోకులేసుకుంటాం. నవ్వుకుంటాం. సోమలింగంగారు అన్నది సీరియస్‌గా తీసుకోలేకపోయాను. డేంజర్ సిగ్నల్‌ని కానుకోలేకపోయాను. నిజమే. ట్రాప్‌లో పడేవరకూ నా ఒళ్ళు నాకు తెలియలేదు. తప్పంతా నాదే" అన్నారు డాక్టర్.

జరిగిందంతా చూస్తుంటే లాయర్‌కన్నా పోలీసే నిజమైన స్నేహితుడు అన్పించింది నాకు. బెయిల్ పిటిషన్‌కి ఖర్చు ఏమిటి? లక్షలెందుకు? డాక్టర్ మిత్రుడు. అంతేకాక ఫీజు తీసుకోకుండా వైద్యం చేశారు కదా. వూర్కెనే చేయమన టం లేదు. బెయిల్‌పై తీసుకొచ్చి అప్పుడు ఫీజు కావల్సినంత తీసుకోవచ్చు కదా.

డాక్టర్ ఇంకో విషయం చెప్పారు. తొలుత లాయర్ యాభైవేలు పంపమన్నా డట. అయిదు నిమిషాల్లో మాటమార్చి లక్ష రూపాయలు తెమ్మన్నాడట. మేజిస్ట్రేట్‌కి లంచం ఇవ్వాలి అన్నాడట. అదెంతవరకూ నిజం! మొత్తం తనే పడేసుకున్నాడేమో. ఏమైతేనేం డాక్టర్‌ని బెయిల్‌పై బయటకు తెచ్చేడు. అందుకు కృతజ్ఞతలు.

మెటీరియలిస్టిక్ జీవితాలలో స్నేహాలు, బంధాలు ఇలాగే ఏడుస్తాయి మరి. డాక్టర్ అవినీతి కేసు నుంచి బయటపడ్డానికి ఇలాంటి అనుభవాలు ఇంకా ఎన్నెన్ని చూడాలో. అంతా భగవంతుడి మీదే భారం వేశాను. భగవంతుడు మా కుటుంబాన్ని ఎప్పటికప్పుడు బాగానే, మంచిగానే చూస్తున్నాడు. ఏనాడూ హాని తలపెట్టలేదు. ఈ కేసు నుంచి డాక్టర్‌కి విముక్తి ప్రసాదిస్తాడని నాకు ప్రగాఢ నమ్మకం. ఈ సందర్భంగా నేను మొక్కుకోని దేవుడు లేడు.

దేవుడు నాకు కలిగించిన ధైర్యాన్ని మావారికి నేను కలిగించలేకపోయాను.

డాక్టర్ ప్రభుత్వ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయబడ్డాడు. సస్పెన్షన్ కూడా పనిష్‌మెంట్‌లో భాగమే. అసలు ఏనాడూ ఇంటిపట్టున వుండని పరమబిజీ డాక్టరు... బెయిల్‌పై వచ్చేక పూర్తిగా ఇంటికే అంకితమైపోయారు.

వారిని చూస్తుంటే నాకు విపరీతమైన దుఃఖం. ఏనాడూ తనని ఈవిధంగా నేను చూడలేదు. పూర్తిగా నీరసించిపోయేరు.

సరిగా తిండిలేదు. సరిగా నిద్రలేదు. అప్పుడప్పుడు క్లబ్‌కి వెళ్ళి తాగేవ్యక్తి... ఇపుడు ఇంటివద్ద తాగుడే తాగుడు. రాత్రిలేదు. పగలు లేదు... తాగొద్దు అని వారించలేకపోయాను. నామాట వినరుకూడా.

వాకింగ్ చేయకుండా ఒక్కరోజైనా వుండలేని డాక్టరు పూర్తిగా వాకింగ్

మానేశారు. వాకింగ్ మిత్రులు తనని రెండుమూడుసార్లు ఫోన్‌చేసి పిలిచేరు. రాలేనని చెప్పేశారు. రానన్నవాడిని ఎంత స్నేహితులైనా బలవంతంగా తీసుకువెళ్ళ లేరు కదా. నా బాధ ఏమిటంటే వాకింగ్ పేరుతో బయటకెళితే మనిషి కాస్త తేరుకుంటాడని.

'పోనీ మనిద్దరం కలసి మరోచోట తిరుగుదాం' అన్నాను..

'సంధ్యా! ప్లీజ్ నన్ను కొన్నాళ్లు ఒంటరిగా వదిలేస్తావా' అన్నారు గట్టిగా, చిరాగ్గా.

డాక్టర్ ఒంటరి అయినా, అతని చేతిలో సెల్‌ఫోన్ నిర్విరామంగా పనిచేస్తూనే వుంది. ఫోన్ ద్వారా తను ఈ అవినీతి కేసునుంచి బయటపడేవిధం ఎట్లనో తెల్సుకునే 'సమస్త' ప్రయత్నాలు చేస్తున్నారు. తాగుతూ అదేపని.

దాంతో కొందరు ఇంటికి వస్తున్నారు. డబ్బు తీసుకుని వెళ్తున్నారు. ఆ ముఖాలు నేనెప్పుడూ చూడనివే.

"వాళ్ళు మీకు నిజంగా సాయం చేసేవాళ్ళే అంటారా?" అని అడిగేను.

"తెలీదు సంధ్యా. నిజంగా నాకు తెలీదుకాని నేనున్న పరిస్థితి సాయం చేస్తాను అన్నవాళ్ళందరినీ నమ్మేలా చేస్తోంది. మనకు డబ్బు ఇబ్బంది లేదు. అవునా. కొందరు పనికిరాని వెధవలనుకుంటాం కాని గమ్మత్తుగా ఆ వెధవలవల్లే పనులవుతాయి. వందరాళ్ళు విసిరితే ఒక్కరాయి అయినా తగలదా. ఆసరా దొరకదా" అన్నారు.

అదీ నిజమేననిపించింది.

నాకు మరింత ఆశ్చర్యం, బాధ కలిగించిన విషయం ఏమిటంటే మావారితో ఎంతో క్లోజ్‌గా వుండే తోటి డాక్టర్లుగాని, స్నేహితులుగాని, బంధువులుగాని పరుగునవచ్చి తనని ఓదార్చే ప్రయత్నం చేయకపోవడం! అందరూ రాలేదని అనను. 'వెళ్ళకపోతేబాగోదు' అనే ధోరణిలో వచ్చి వెళ్ళిపోయేవారు. కొందరు ఫోన్ల ద్వారా విచారం వెలిబుచ్చుట! నిజానికి వీళ్ళంతా డాక్టరు ఏసీబీకి పట్టుబడి నందులకు పరమసంతోషం పొందుతున్నారేమో అనిపించింది.

ఈ పరిస్థితుల్లో మాపిల్లలు దగ్గర లేకపోవడం మరింతగా ఒంటరితనం నన్ను బాధించింది. మాకు ఇద్దరు పిల్లలు. కూతురు దీప్తికి మొన్నమొన్ననే పెళ్ళి అయింది. కూతురూ,అల్లుడూ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. పూణేలో వుంటున్నారు.

కొడుకు పేరు సందీప్. యం.బి.బి.యస్ పూర్తిచేసి యం.డి చదువులు హైదరాబాద్‌లో చదువుతున్నాడు.

విషయం తెలిసి పిల్లలిద్దరూ పరుగునవచ్చేరు. పిల్లలను చూడగానే నాలో కొండంత ధైర్యం. డాక్టరు పిల్లలను దగ్గరకు తీసుకున్నాడు. కొడుకు చదువు, కూతురి ఉద్యోగం గురించి అడిగి తెల్సుకున్నారు. తర్వాత ఏ ఉత్సాహం లేదు. అదే నిర్లిప్తత.

సందీప్ చదువులో నెంబర్ వన్. అది సరిపోదు కదా. ఈ మాయదారి ప్రపంచంలో నెగ్గుకురాలేని పెద్ద అమాయకుడు. లోకంపోకడ అర్థం కానివాడు. తను రావడం వచ్చేడు. కాని తండ్రిని ఏమాత్రమైనా ఓదార్చగలిగాడా. పైగా తండ్రి ఏదో చేయరాని తప్పు చేసిన ఒకపెద్ద క్రిమినల్‌గా భావించి 'అమ్మా చట్ట ప్రకారం నాన్న జైలుకి వెళ్ళక తప్పదంటావా?' అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. వీడిని కూడా నేనే ఓదార్చాలి. వీడి చదువులు పూర్తి అయ్యాక ఒకపెద్ద హాస్పటల్ కట్టించి తనచేత నడిపిద్దామని తండ్రి ఆలోచన. అది అయ్యేపనేనా?

దీప్తి సందీప్‌లా కాదు, చాలా చురుకైనది. వృత్తినేకాదు జీవితాన్నే వ్యాపార దృష్టితో చూసే లక్షణమైన పిల్ల. తండ్రివద్ద తనకి చాలా చొరవ. కూతురు చెప్పింది తండ్రి చెయ్యాల్సిందే. తను కూడా తండ్రిని ఓదార్చలేకపోయింది.

కాని మేమంతా దిగ్భ్రమ చెందేలా డాక్టర్‌ని అభిమానించే రోగులే ఆయనలో చైతన్యం తీసుకువచ్చేరు. రోజూ క్లినిక్‌కి వచ్చి ఎప్పటిలా రోగులకు వైద్యం చేసేలా డాక్టర్‌లో ఆత్మవిశ్వాసం కలిగించేరు. ఒత్తిడి తీసుకువచ్చేరు.

తనకు నగరంలో ఆర్థోడాక్టర్‌గా, నిపుణుడుగా, మంచి సర్జన్‌గా పేరుంది. వూళ్లో ఎవరినడిగినా డాక్టర్ రంగనాథం పేరే ముందుగా రిఫర్ చేస్తారు. అతనివద్దకే వెళ్ళమంటారు. అతని హస్తవాసిపై రోగులకి అపారనమ్మకం. అతని చేయి తగిలితే చాలు వ్యాధి నయమైపోతుందని ప్రగాఢ విశ్వాసం.

ప్రతిరోజు సాయంత్రం నాలుగ్గంటల నుంచీ రాత్రి పది గంటల వరకూ క్లినిక్‌లో రోగులను డాక్టర్ చూస్తాడు. రోజుకి నలభైమందిని మాత్రమే చూస్తాడు. దానికి ముందుగా రిజిస్ట్రేషను, నెంబరింగ్. అయితే అర్జెంట్ కేసులకు మినహాయింపు వుంది. ఒక్కొక్కసారి క్లినిక్ నుంచి మధ్యలో వెళ్ళి తక్షణం చేయాల్సిన ఆపరేషన్ చేసేసి, మళ్ళీ క్లినిక్‌లో కేసులు యథావిధిగా చూస్తాడు. ఇలా కిటకిటలాడే క్లినిక్ మూడు, నాలుగు వారాలుగా మూతపడటంతో రోగులు తల్లడిల్లిపోయేరు.

రోగులకు ఆయన అవినీతి చరిత్రతో పనిలేదు. అవినీతిపరుడిగా గుర్తించి ఏసీబీ కేసు పెట్టినా, డాక్టర్‌పై రోగులకు అసహ్యంలేదు. కోపం రాదు. డాక్టర్ ఎంతెంత లంచాలు తీసుకొని సంపాదిస్తున్నాడనేది వాళ్ళకు అనవసరం. అతని

సర్వీసు మాత్రమే అగత్యం. అత్యంత అవసరం. అంతేకాదు అవసరమైతే రోగులు ఇప్పటికీ అతనికి లంచాలు ఇవ్వడానికి సిద్ధం. కన్సల్టేషన్ ఫీజు 250 నుంచి 300 రూపాయలకు పెంచినా ఆయన వైద్యం కోసమే లైన్ కడతారు.

ఎట్టకేలకు రోగుల ఒత్తిడికి తలవొగ్గి క్లినిక్‌కి వెళ్ళడం ప్రారంభించాడు డాక్టర్ రంగనాథం.

డాక్టర్ పూర్తిగా బిజీ అయిపోయేరు. సాయంత్రం క్లినిక్. ఉదయం ఆపరేషన్లు. అవసరమైతే అర్ధరాత్రులు కూడా ఆపరేషన్లు. మావారిని మళ్ళీ ఇలా చూస్తానను కోలేదు. ఇదంతా దేవుని చల్లనిచూపే. నాగుండె దిటవు అయింది.

దేవుడి దయవల్ల మాకు డబ్బుకి లోటులేదు. డాక్టర్ ఉద్యోగం నుంచి సస్పెండ్ అయినా కూడా ప్రతినెలా ఆరేడు లక్షలు ఏమీకాకుండా సంపాదిస్తు న్నాడు.

సంపాదనలో పడి ఏసీబీ కేసు విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం లేదు. కోర్టులో శిక్ష ఖరారు అయితే నాలుగైదు సంవత్సరాల జైలు జీవితం తప్పదేమోననే భయం డాక్టరులో అలానే వుండిపోయింది. జరిమానా ఎంతవేసినా కట్టడానికి సిద్ధమే. జైలు శిక్ష పడితే మాత్రం ఆయన మాకు దక్కరేమోనని నా భయం. చేతులెత్తి దేవుడిపై భారమంతావేశాను. మొక్కులెన్నో మొక్కాను.

రాజారావుని అనుకూలంగా తిప్పుకుంటే ఏసీబీ కేసు నుంచి సులువుగా బయటపడవచ్చు అంటాడు మా లాయరు.

ప్రయత్నించాం. ఎంత ప్రలోభపెట్టినా రాజారావు లొంగేలా కన్పించలేదు. వాడు ఒక చిన్న ప్రయివేటు కాలేజీలో ఆరేడువేలు జీతం తెచ్చుకుంటాడు. అంత అల్పుడి చేతిలో ఒక పెద్ద డాక్టరు దారం కట్టబడిన తూనీగలాగా విలవిల్లాడి పోతున్నాడు.

రాజారావు ఉద్యోగం చేస్తున్న కాలేజీ ప్రిన్సిపల్ చేత చెప్పించాడు. అతడి స్నేహితుడి చేత, బంధువుచేత చెప్పించాము. ఒప్పుకోలేదు.

డాక్టర్ అతడిని అడిగింది అయిదువేలు లంచమే. మేము అతడికి ఆఫర్ చేసింది. రెండు లక్షలు. దారికిరాలేదు. చిత్రమయిన మనిషి!

రెండు లక్షలకి తృపిపడటం లేదేమోనని డాక్టర్ భావించి ఒకరోజు రాజారావుని క్లినిక్‌కి పిలిపించి 'నాకు అనుకూలంగా నీవు మారితే రెండు లక్షలు కాదు ఎంతైనా ఇస్తా'నన్నాడు. వినలేదు. 'డబ్బుతో నన్ను కొనలేరు' అన్నాడు. ఒకసారి నేను కూడా వాడింటికి వెళ్ళి బ్రతిమిలాడేను.

'నా భార్య ఆత్మశాంతించాలంటే నీ భర్త జైలు కటకటాలు లెక్కపెట్టవలసిందే' అన్నాడు రాజారావు కసిగా, కటువుగా.

డాక్టరే వాడి పెళ్ళాన్ని చంపాడంటాడు. అది నిజంకాదు. ఆమె వంటగదిలో జారిపడి, తుంటె ఫ్రాక్చరై ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ అయింది. ఆపరేషన్ చేయడానికి మావారు అయిదువేలే అడిగారు. అదే కార్పొరేట్ ఆసుపత్రి అయితే పాతికవేలు ఫీజు తీసుకుంటారు. ఎంచక్కా అడిగిన డబ్బు డాక్టర్ చేతిలో పెట్టి ఆపరేషన్ చేయించుకోకుండా ఏసీబీ వారికి పకడ్బందీగా పట్టించేశాడు. ఏ లంచంతో పనిలేకుండా మరో డాక్టర్‌తో ఆమె ఆపరేషన్ జరిగేదే. కాని దురదృష్ట వశాత్తు ఆమెకు గుండెపోటు వచ్చి చచ్చిపోయింది. ఆమె కర్మకొలదీ పోయింది. ఆమె చావుకి మావారు ఎలా బాధ్యులవుతారు?

మరిక రాజారావు జోలికి వెళ్ళడం మానుకున్నాం. బయటపడటానికి అదొక్కటే మార్గం కాదుకదా. సవాలక్షమార్గాలు! ఈమధ్య సొమ్ము పట్టుకొని విమానంలో సెక్రటేరియట్‌కి డాక్టర్ వెళ్ళి వస్తున్నాడు.

రాజారావుని డాక్టర్ వదిలేసినా, వాడు మాత్రం డాక్టర్‌ని వదలలేదు. వాడిని డబ్బుకి లొంగదీసుకునే ప్రయత్నం చేయడంవల్ల కాబోలు, డాక్టర్ తనకి లోకువ య్యేడు. అప్పుడప్పుడు అతడు క్లినిక్‌కి రావడం, డాక్టర్‌ని వేధించడం చేయసాగేడు. కేకలు, తిట్లు కాకుండా, మర్యాదగానే మాటాడుతూ డాక్టర్ బుర్ర తినేసేవాడు.

ఇటువంటివి కిక్కురుమనకుండా భరించేశక్తి డాక్టర్‌లో అపారంగా వుంది. అవతలవాడు ఎంతటి వాడైనాసరే మాటాడేవాడిని ఒక రోగిగా భావిస్తాడు. నిశ్చలంగా, మందస్మితవదనంతో, ఎంతో ఓపిగ్గా ఎంతసేపైనా వింటూ కూర్చుం టాడు. అటు చూడవలసిన రోగులు వెయిటింగ్‌లో ఎంతమందివున్నా... ఎదురుగా వున్న రోగితో ఎటువంటి ఒత్తిడిలేకుండా ప్రవర్తిస్తాడు. అంతేతప్పా బోయ్‌ని పిలిచి బయటకు నెట్టేయడు. పోలీసులకు ఫోన్ చేయడు.

డాక్టర్ ఇలాంటి న్యూసెన్స్‌లకు బాగా అలవాడుపడిపోయేరు. కొందరు జర్నలిస్టులూ, ట్రేడ్ యూనియన్ నాయకులూ, చోటా రాజకీయ నాయకులూ, రౌడీలూ, గుండాలు వస్తుంటారు. ట్రీట్‌మెంట్‌కి కాదు? "డాక్టర్! నీవు రోగుల దగ్గర ఎన్నెన్నో విధాలుగా దోచేస్తున్నావు. అడ్డంగా సంపాదించేస్తున్నావు. నిన్ను అల్లరిపెట్టడం మాకు పెద్దపనేమీ కాదు. ఏదో నీవు అప్పుడప్పుడూ మావైపు కాస్త చూస్తుంటే, మేము నిన్ను చూసీచూడనట్టు వదిలేస్తాం" అని నోరు విప్పి అనరు గాని వాళ్ళరాకలో ఉద్దేశం అదే. అంచేత డాక్టర్ 'మీకెందుకివ్వాలి' అని

వాదన పెట్టుకోరు. గప్‌చిప్‌గా ఎంతోకొంత ఇచ్చి, నమస్కారం పెట్టి పంపించే స్తాడు. ఇక జనవరి ఫస్ట్‌కైతే జాతరే. ఆరోజు డాక్టరు ఒక అరలక్ష రూపాయలు తనవి కాదనుకుంటాడు.

రాజారావు డాక్టర్ ఎదురుగా కూర్చొని నీ జుట్టు నా చేతిలో వుంది. అన్నట్టు చూస్తాడట. నీ ప్రాణాలు నా చేతిలో ఉన్నాయి అన్నట్టు మాటాడతాడట.

"ఏమిటి సార్. నీకు అనుకూలంగా ప్లేటు ఫిరాయిస్తే, నాకు ఎంతైనా ఇస్తారా? నీ అవినీతి సంపాదన వద్దుగాని నెలనెలా నీ జీతంలో సగం ఇస్తావా? నీవు రిటైర్ అయ్యేక కూడా నీ పెన్షన్‌లో సగం కావాలి ఇస్తావామరీ" అంటాడట.

డాక్టర్ నవ్వుతూ వినడమేకాని సమాధానం వుండదు. మరోసారి వచ్చి "ఇది ఇండియా గాబట్టి నీకు జైలు శిక్షతోనే సరిపెట్టేస్తారు. అదే చైనా అయితే నిన్నీపాటికి ఉరికంబానికి వేలాడదీసి ఉండేవారు తెల్సా" అంటాడట. ఇంకోసారి వచ్చి "నాకు అస్త్ర ప్రయోగమే తెల్సు. అస్త్ర ఉపసంహరణ తెలీదు. ఈ యుద్ధంలో ఎవరొకరు లేచిపోక తప్పదు. నమస్తే, వస్తాను" అన్నాడట. అదే చివరిసారి. మరిక రాలేదట.

అసలు ఏమిటి ఇదంతా? డాక్టరు మా శ్రీవారు అని వెనకేసుకురావడం కాదు. ఆయన్ని నేరస్థుడు అంటే ఎట్టా? అవినీతి పంకిలంలో ఆయనొక్కడే పొర్లుతున్నాడా? అవినీతి ఎక్కడలేదు? మనచుట్టూ వుంది. మన రక్తంలో వుంది. ఇక్కడా అక్కడా అనికాదు ఎందెందు చూసినా అందందు సుబ్బరంగా బలిసివుంది.

లంచం తినని ప్రభుత్వ డాక్టర్లు ఎంతమంది వున్నారు? మావారిని నేరస్థుడి లా అంతా చూడటం ఏమిటి? డాక్టర్లంతా ఏం చేస్తున్నారో అదే చేశాడు.

చదువు అయ్యేక ఫ్రెష్‌గా, డాక్టర్‌గా తను ప్రభుత్వ ఆస్పత్రిలో అడుగెట్టగానే అడుసు అంటుకుంది. అవినీతి అప్పటికే అక్కడ చాపకింద నీరులా ప్రాక్టీసులో వుంది. ఆ సంస్కృతి అతనికీ అలవడింది.

అయితే అది సడెన్‌గా ఒకానొకరోజు తప్పుగా ఎంచబడింది. నేరంగా చూడబడింది. కేసు పెట్టబడింది. ఆస్పత్రిలో బొచ్చెడు డాక్టర్లుండగా తేరగా మావారే దొరికేరా.

ఎవడో దిక్కుమాలిన వెధవ ఏదో కంప్లయింట్ చేస్తే, మొత్తం అవినీతికి చెక్ పెట్టకుండా, అమాయకుడిపై వల విసిరేయడమేనా. వ్యవస్థాపరంగా నేరంకాని అవినీతి చట్టరీత్యా నేరమయికూర్చుంది. డాక్టర్‌ని కటకటాల వెనక్కి పంపిస్తోంది. ఇదెక్కడి న్యాయం?

డాక్టర్ చవటలా, ఒక చేపలా దొరికిపోయేడు. వల విసిరి చిన్నచిన్న చేపలను కాకుండా తిమింగలాలను పట్టుకోగల దమ్ము ఎవరికైనా వుందా? దేశాన్ని కొల్లగొట్టబడుతున్న కోట్లాదికోట్ల రూపాయల స్కామ్‌లను తరచు పేపర్లో, టీవీలో నోరెళ్ళ బెట్టి చూస్తున్నాం. ఆ స్కామ్‌ల సొమ్ముతో దేశంలో పేదరికాన్ని చీపురుతో తుడిచేసినట్టు పారదోలవచ్చుట. స్కాములపై కోట్లు ఖర్చుపెట్టిన దర్యాప్తులే చూశాం గాని ఏ ఒక్కరికైనా శిక్షపడిందా? ఒకనాడు అవినీతికి పర్యాయపదంగా నిలిచి జాతిజనులను దిగ్భ్రాంతి పరిచిన బోఫోర్స్ కేసు ఏమైంది? పూర్తిగా సమాధి చేయబడింది. అవినీతి మన నేలపై పూర్తిగా వ్యవస్థాగతమై, మన రాజకీయ, ఆర్థిక, సాంఘిక, నైతిక స్వభావంలోనే బలంగా వేళ్ళూనుకొని జీర్ణించుకుపోయింది. అవినీతి సముద్రంలో డాక్టర్ ఒక నీటిబొట్టు.

అన్నిరకాల అవినీతికి తల్లివేరు రాజకీయ అవినీతి గనుక డాక్టర్ ఆ దిశగా వెళ్ళేరు. సెక్రటేరియట్ కొత్త. ఎం.ఎల్.ఏలు కొత్త. మంత్రులు కొత్త. అధికారులు కొత్త. డబ్బుకైతే వీళ్ళందరూ తెలుస్తారు. అంచేత డబ్బుతో పరిచయం చేసుకున్నాడు. వాళ్ళందరినీ. ఎట్టకేటలకు ముఖ్యమంత్రి షేషీ పట్టుకొని వ్రేలాడగలిగేడు.

ఏసీబీ కేసులో డాక్టర్ నిర్దోషి అని తిరుగులేని విధంగా ఒక నోట్ తయారు చేసి ముఖ్యమంత్రి ముందుపెట్టగా, వారు ఆ నోట్‌పై 'ప్లీజ్ సర్క్యులేట్' అని చిన్న సంతకం చేశాక, సదరు నోట్ సంబంధిత విభాగాలకు రూట్ చేయబడింది. రెండు, మూడుసార్లు ఆ నోట్ ఎక్కడెక్కడో చిక్కుకుపోయి కనబడేదికాదు. విసుగు చెందని విక్రమార్కుడై డాక్టర్ ఆ నోట్‌ని ఒక మంత్రి ద్వారా గాలించి పట్టుకో గలిగేడు. నోట్ రూటింగ్‌లో ఏ ద్వారం వద్ద ఆగిపోయినా రూపాయి నోట్లు ఆ నోట్‌కి చైతన్యం కలిగించేవి. ఆవిధంగా అందరి సంతకాలతో అనుకూల కామెంట్స్‌తో జయప్రదంగా పయనించి ఫైనల్‌గా ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేయబడింది.

ఒక ముప్పయితొమ్మిది లక్షలు మావి కాదనుకోవడంతో డాక్టర్ విజయం సాధించేరు. న్యాయస్థానంలో పద్ధతిప్రకారం నిర్దోషిగా నిరూపితమయ్యేరు. అంతా దేవుడి దయ. అతిత్వరలో అన్నిమొక్కులూ తీర్చేయాలి.

ఏసీబీ కేసులోంచి డాక్టర్ బయటపడటానికి ఇరవైరెండు నెలల కాలం పట్టింది. సరైన ఛానల్ దొరకకపోవడం వల్ల, తెలియకపోవడం వల్ల అంత టైము తీసుకుందని అనుకుంటున్నాను. ఏదిఏమైనా ఇంచుమించు రెండేళ్ళు మానసిక క్షోభ అనుభవించేరు డాక్టర్. అది ఒకరకంగా శిక్షే కదా.

డాక్టర్ సీనియర్ ప్రొఫెసర్ కావడం చేత ఆర్థోవార్డుకి హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటుగా పదోన్నతి పొందేరు. తోటి డాక్టర్లు, మిత్రులు నగర ప్రముఖులు అభినందనలు తెలిపేరు. డాక్టర్ మళ్ళీ తన పాతమిత్రులు చలపతిరావు వగైరాలతో వాకింగ్ చేస్తున్నారు.

మొత్తంమీద నాకు చాలా సంతోషంగా వుంది. అమ్మో! ముప్పయితొమ్మిది లక్షలు ఏట్లో కొట్టుకుపోయేయి అనే బాధ లేదు నాకు. అసలు మా అబ్బాయి సందీప్‌కి యమ్.డి. సీటు యాభై, అరవై లక్షలతో కొందామనుకున్నాం. కాని వాడు మాకు అంతటి అవకాశం ఇవ్వలేదు. మెరిట్‌తో సీటు తెచ్చుకున్నాడు. అటు పోయాల్సిన డబ్బు ఇటు పోసేం అంతే. అంతకన్నా ఏంలేదు.

అంతా బాగుందికాని మా సందీప్ మమ్మల్ని చికాకు పెడుతున్నాడు. వాడు ఇక్కడ ఉద్ధరిస్తాడనుకుంటే అమెరికా అంటున్నాడు. అక్కడ ఇంకా ఏవేవో చదువులు చదువుతాడట. అంతేకాదు అమెరికాలోనే డాక్టర్‌గా సెటిల్ అవుతాడట. కార్పొరేట్ ఆస్పత్రిస్థాయిలో ఒక పెద్ద హాస్పటల్ కట్టి వాడిచేతిలో మేము పెట్టాలనుకుంటే వాడు తీసుకున్న నిర్ణయం అది.

నిజానికి వాడు అమెరికా వెళ్ళడం కాదు. ఈ దేశం వదలిపారిపోతున్నాడు. తండ్రి ఏసీబీ కేసు వాడిని అంతగా కుదిపేసి భయపెట్టినట్టుంది. అవినీతి దేశానికి దూరంగా వుంటాడట! చూద్దాం. ఎన్నాళ్లో!

ఏసీబీ కేసు వ్యవహారం అంతా సుఖాంతమే అనుకున్నాను. కాని అంతలోనే హృదయం కలచివేసే విషాదం.

పాపం రాజారావు చనిపోయాడు. పూర్‌ఫెలో. ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణం లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని జేబులో ఉత్తరం మరింత సంచలనం రేపింది.

"లంచాన్ని సహించలేకపోవడం నాకున్న పెద్ద రోగం. నాకు ఒక అవకాశం వచ్చిందికదాని చేతికందిన ఒక కలుపుమొక్కను పీకివేయబోతే అది వికటాట్టహాసం చేసి, 'వురే. నేనొక వూడలు దిగిన మహావృక్షాన్ని రా. నా వెంట్రుక కూడా తెంపలేవురా' అంది. అది ధనస్వామ్య పడగనీడలో వర్ధిల్లుతూ విర్రవీగుతోంది. ఈ దేశంలో కరప్షన్ అండ్ కరన్సీ ఆర్ నైబర్‌హుడ్ గుడ్ ఫ్రెండ్స్ అని నాకు అనిపిస్తోంది.

లంచం తీసుకొని నేరస్థుడైనవాడు లంచంతోనే నిర్దోషిగా బయటపడటం ఈదేశ దౌర్భాగ్యం. అవినీతి గెలుస్తూ పోతున్నప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడం.

ఆందోళనచెంది తిరుగుబాటు చేయకపోవడం నన్ను బాధిస్తోంది. ప్రజల నిర్లిప్త వైఖరిపట్ల నిరసనే నా మరణం" కింద రాజారావు సంతకం.

రాజారావు మరణం ఒక సంచలనం రేపింది. మీడియా కదిలింది. రెండు, మూడు రోజులుగా, అదేపనిగా వార్తలు, సమీక్షలు, విశ్లేషణలు, ఇంటర్వ్యూలు. ఏసీబీ అధికారి సోమలింగంని మీడియా ప్రశ్నించింది.

"మీ సంస్థ డాక్టర్ రంగనాథంపైనే కాదు, ఎంతోమంది అవినీతిపరులపై ఎన్నెన్నో కేసులు రుజువులతో, సాక్ష్యాలతో ఎంతో పకడ్బందీగా పెడుతున్నారు. కేసులు పెట్టడమే తప్ప శిక్షలు ఎవరికీ పడటంలేదు. అవినీతిని మనచట్టాలు ఎందుకు నిరోధించలేకపోతున్నాయి. అవినీతి కేసుల విఫలత ఒక అలవాటుగా మారిపోతోంది. ఈస్థితిలో ఏసీబీ సంస్థపై ప్రజలకు విశ్వసనీయత ఏముంటుంది చెప్పండి?"

"చెప్పడానికి ఏముంది. అవినీతిపరులను పట్టుకొని కేసులు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించడం వరకే మా ఏసీబీ సంస్థ పని" అన్నాడు సోమలింగం ముక్తసరిగా.

ఈ విషయం వాకింగ్‌లో డాక్టర్‌తో చెప్పారట సోమలింగం.

ఏదిఏమైనా రాజారావు మరణం డాక్టర్‌కి చాలా దుఃఖం కలిగించింది.

ఒకప్పుడు రాజారావుకి ఇద్దామనుకున్న రెండు లక్షలను అతని ఇద్దరు పిల్లల పేర బ్యాంక్‌లో డిపాజిట్ చేయించేడు డాక్టర్. అంతేకాక ఆ పిల్లల చదువులకయ్యే మొత్తం ఖర్చుని భరించడానికి డాక్టర్ ముందుకొచ్చేడు. ఆవిధంగా తన వితరణశీలాన్ని చాటుకున్నాడు.

అవినీతి మరియు దాతృత్వం మనదేశ సంస్కృతి.

*(సాహితీ స్రవంతి- సెప్టెంబర్-అక్టోబర్ 2011)*